
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.6 । కనిష్ఠం 12.8



నిజామాబాద్
జిల్లా వార్తలు



• రోడ్డుపైనే చేపలు విక్రయిస్తున్న దృశ్యం

వైభవంగా గణపతి పూజలు

• చంద్రదర్శనంతో ఉపవాస దీక్షల విరమణ

నిజామాబాద్ కల్చరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సంకటాలను తొలగించే గణనాథునికి భక్తులు వైభవంగా చతుర్థి పూజలు నిర్వహించారు. బుధవారం ఆలయాల్లో గణపతికి చతుర్థిని పురస్కరించుకొని అభిషేకాలు, ప్రత్యేక అర్చనలు జరిపారు. ఆలయంలో కొలువుదీరిన గణనాథునికి అష్టోత్తర శతనామాలతో గరిక పూజలు నిర్వహించి గణపతి హోమం చేశారు. ఆలయ ప్రాంగణంలో సాయంత్రం సామూహిక సంకష్ట హర చతుర్థి పూజలు నిర్వహించి చంద్రదర్శనంతో ఉపవాస దీక్షను విరమించారు. జిల్లా కేంద్రంలోని లక్ష్మీగణపతి ఆలయం, సార్వజనిక్ గణేష్ ఆలయం, పద్మానగర్‌లోని వరసిద్ధివినాయక ఆలయం, బొడ్డెమ్మ చెరువు వద్ద గల గణపతి ఆలయం, బ్రహ్మపురిలోని సిద్ధివినాయక ఆలయం, న్యూ హౌజింగ్ బోర్డులోని మహాగణపతి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



నగరంలోని సార్వజనిక్ గణేష్ ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

రోడ్డుపైనే సంత.. సమస్యలతో చింత!



• డిచ్‌పల్లిలో రోడ్డుపైనే కొనసాగుతున్న వార సంత

- రాకపోకలకు తప్పని ఇక్కట్లు
- కానరాని కనీస సౌకర్యాలు
- రసీదు ఇవ్వకుండానే డబ్బులు వసూలు చేస్తున్న తైబజారు నిర్వాహకులు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు

డిచ్‌పల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపైనే వార సంత నిర్వహిస్తుండడంతో వాహనదారులు, పాదచారులకు ఇక్కట్లు తప్పడం లేదు. మండల కేంద్రంలో ప్రతీ బుధవారం రోడ్డును ఆక్రమించి నలువైపులా సంత నిర్వహిస్తుండటంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపైనే కూరగాయలు, మాంసం, చేపలు, దుస్తుల విక్రయాలు చేస్తుండటంతో వాహనచోదకులకు సంత రోజు ఇక్కట్లు తప్పడం లేదు. పంచాయతీ సిబ్బంది సంతను వేలం పాట ద్వారా 10లక్షల రూపాయలు తీసుకుంటున్నా.. అందుకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించడం లేదు. మార్కెట్‌కు వచ్చే వారికి కనీస అవసరాలు మూత్రశాలలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పక్కనే చికెన్ విక్రయ దుకాణాలు ఉండటం, నిర్వాహకులు చికెన్ వ్యర్థాలను రోడ్డు పైనే పడేయడంతో వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే తైబజారు నిర్వాహకులు రసీదు ఇవ్వకుండానే విక్రయదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. తైబజారు నిర్వాహకులను ప్రశ్నిస్తే 'ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి' అంటూ బెదిరిస్తున్నారని చిరు వ్యాపారులు వాపోతున్నారు. కాగా, ఈ విషయంలో డీఎల్పీవో శ్రీనివాస్‌కు స్థానికులు ఫిర్యాదు చేశారు.

ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన దిల్‌రాజు



దిల్‌రాజును అభినందిస్తున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు

నిజామాబాద్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా జిల్లాకు చెందిన దిల్ రాజు బుధవారం హైదరాబాద్‌లోని కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. మోపాల్ మండలం నర్సింగ్‌పల్లికి చెందిన దిల్‌రాజు సినీ పరిశ్రమలో నిర్మాతగా, పంపిణీదారుడిగా మూడు దశాబ్దాలుగా కొనసాగుతున్నారు. తెలంగాణలో పెద్ద నిర్మాతగా ఉన్న ఆయనను ప్రభుత్వం కార్పొరేషన్ చైర్మన్‌గా వారం క్రితం నియమించింది. ఆయన బాధ్యతల స్వీకరణ సందర్భంగా రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లాకు చెందిన మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు తాహెర్‌బిన్ హందాన్, కాసుల బాల్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డితో పాటు జిల్లాకు చెందిన పలువురు నేతలు హాజరై ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

దిల్‌రాజుకు పలువురి అభినందనలు

నిజామాబాద్ అర్బన్: తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన దిల్‌రాజును పలువురు నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. నర్సింగ్‌పల్లికి చెందిన దిల్‌రాజును బుధవారం హైదరాబాద్‌లోని ఫిల్మ్ చాంబర్‌లో నిజామాబాద్ రూరల్ నియోజకవర్గానికి చెందిన నేతలు కలిసి అభినందనలు తెలిపారు. బాడ్సికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు శేఖర్‌గౌడ్, ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్, మాజీ ఎంపిపి కేతావత్ యాదగిరి, చంద్రునాయక్ తదితరులు అభినందనలు తెలిపారు.

ఐటీ హబ్‌పై పట్టింపు కరువు!



- జిల్లాకు వచ్చేందుకు మొగ్గుచూపని సాఫ్ట్‌వేర్ కంపెనీలు
- గత ప్రభుత్వ హయాంలో యూఎస్, ఆస్ట్రేలియాకు చెందిన కంపెనీలతో ఒప్పందాలు
- ఇప్పటి వరకు బ్రాంచ్‌ల ఏర్పాటుకు ముందుకు రాని విదేశీ కంపెనీలు
- బీఆర్ఎస్ హయాంలో ప్రారంభించిన స్టార్టప్ కంపెనీలకే పరిమితం
- జిల్లాలోని ఇంజనీరింగ్, ఇతర గ్రాడ్యుయేట్‌లకు లభించని ఉద్యోగాలు
- జిల్లా కేంద్రంలో రూ.43కోట్లతో ఐటీహబ్ నిర్మించినా యువతకు అందని ఉపాధి

నిజామాబాద్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ కోసం కోట్లు ఖర్చు చేసి ఐటీహబ్ నిర్మించినా ఫలితము లేదు. జిల్లా ప్రజాప్రతినిధులు, నేతల పట్టింపు లేకపోవడం వల్ల పెద్ద కంపెనీలు రావడం లేదు. కంపెనీలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించినా జిల్లాకు వచ్చేందుకు పెద్ద కంపెనీలు మొగ్గు చూపడం లేదు. వాటి బ్రాంచ్‌లను ఇక్కడ ఏర్పాటు చేయడంలేదు. జిల్లాలో ఉన్నత, సాంకేతిక విద్యను అభ్యసించిన విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు కల్పించేందుకు నిర్మించిన భవనం కూడా ఖాళీగానే ఉంటుంది. కొన్ని అంకుర సంస్థలు, చిన్న కంపెనీలు మినహాయిస్తే సాఫ్ట్‌వేర్‌లో తేలిన కంపెనీలు రాలేదు. ఉన్న కంపెనీలు కూడా కొన్ని వదిలి వెళ్తుండగా ఇవి కూడా సాఫ్ట్‌వేరేతర కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. జిల్లాలో పెద్ద కంపెనీలకు కావాల్సిన ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్‌కు సంబంధించిన గ్రాడ్యుయేట్‌లు అందుబాటులో లేకపోవడం సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన అనుభవం ఉన్న ఉద్యోగులు ఇక్కడికి వచ్చేందుకు మొగ్గు చూపకపోవడం వల్ల ఎక్కువ కంపెనీలు రావడం లేదు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నికలకు ముందు కొన్ని కంపెనీలను ఏర్పాటు చేసినా అనుకున్న విధంగా ఉపాధి మాత్రం రావడం లేదు. కార్పొరేషన్ ద్వారా ఇతర కంపెనీల కోసం ప్రయత్నాలు కొనసాగుతున్నా పెద్ద కంపెనీలు ఇంకా జిల్లాకు రాకపోవడం వల్ల సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన ఉపాధి మాత్రం ఇక్కడి విద్యార్థులకు రావడం లేదు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మాణం

జిల్లా కేంద్రాలకు సాఫ్ట్‌వేర్ రంగాన్ని తీసుకువచ్చి ఒత్తిడిని తగ్గించేందుకు గత ప్రభుత్వ హయాంలో కొన్ని జిల్లాలో ఐటీ హబ్‌ల నిర్మాణాలు చేపట్టాయి. నిజామా బాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల పరిధిలో వీటి నిర్మాణాలు చేపట్టారు. సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన పెద్ద కంపెనీలను జిల్లా కేంద్రాలకు తీసుకువచ్చి ఇక్కడి విద్యార్థులకు ఉద్యోగాలను కల్పించేందుకు వీటి నిర్మాణాలు చేపట్టారు. నిజామాబాద్‌లో కూడా రూ.43 కోట్లతో బైపాస్ రోడ్‌లో ఐటీ హబ్ నిర్మాణాన్ని చేపట్టారు. సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన పెద్ద కంపెనీలను జిల్లా కేంద్రానికి తీసుకువచ్చి ఇక్కడి నిరుద్యోగ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్‌లతో పాటు మేనేజ్‌మెంట్, ఇతర గ్రాడ్యుయేట్, పోస్టుగ్రాడ్యుయేట్‌లకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలను కల్పించేందుకు నిర్ణయించారు. ఈ భవన నిర్మాణాన్ని గత ప్రభుత్వ హయాంలో పూర్తి చేశారు. జిల్లాలో ఉన్న మూడు ఇంజనీరింగ్ కళాశాలలు, విశ్వవిద్యాలయంతో పాటు ఇతర డిగ్రీ కళాశాలలకు చెందిన విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలను కల్పించేందుకు దీనిని నిర్మాణం చేశారు. ఐటీ హబ్‌కు అనుసంధానంగా సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన ఉద్యోగాల కోసం స్కిల్స్‌పై వివిధ కళాశాలలను ఎంపిక చేసి ఉపాధి కల్పించే విధంగా ఈ భవనాన్ని నిర్మించారు. జిల్లాలోని బీటెక్, ఎంటెక్, బీసీఏ, ఎంసీఏ, బీఎస్సీ కంప్యూటర్స్, ఎమ్మెస్సీ కంప్యూటర్, ఎంబీఏ కంప్యూటర్స్, స్టాటిస్టిక్స్ అండ్ కంప్యూటర్స్ చదివిన విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో ఈ ఐటీహబ్ నిర్మాణం చేపట్టారు. వీరితో పాటు బీకాం కంప్యూటర్స్ చదివిన వారికీ ఉపాధి కల్పించేందుకు నిర్ణయించారు. హైదరాబాద్, బెంగుళూర్‌లో ఉన్న కంపెనీలతో పాటు యూఎస్, ఆస్ట్రేలియాలో ఉన్న కంపెనీలతో కూడా కొన్ని ఒప్పందాలు చేసుకున్నారు.

680 మందికి ఉపాధి కల్పించే విధంగా ఏర్పాట్లు

ఐటీహబ్‌లో మొత్తం మూడు ఫ్లోర్‌లు ఉన్నాయి. వీటిలో 680 మందికి ఉపాధి కల్పించే విధంగా ఏర్పాట్లను చేశారు. ఈ హబ్ ఏర్పాటై సంవత్సరంన్నర దాటినా ఇప్పటికీ పెద్ద కంపెనీలు మాత్రం రాలేదు. ప్రస్తుతం అంకుర సంస్థలు, చిన్న కంపెనీలు 12 మాత్రం పనిచేస్తున్నాయి. మొత్తం 280 మందికి ప్రస్తుతం ఉపాధి కల్పిస్తున్నారు. ప్రధానంగా సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన ఉపాధి అవకాశాలు ఈ కంపెనీలో లేవు. కస్టమర్‌కేర్, ఇతర రంగాలకు సంబంధించిన పనులే చేస్తున్నారు. ఐటీహబ్‌లో ప్రధా నంగా సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన కార్యక్రమాలు ఎక్కువ గా నిర్వహించాలి. సాఫ్ట్‌వేర్ అభివృద్ధితో పాటు మార్కె టింగ్, డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పాటు ఇతర రంగాలకు చెందిన కంపెనీలు ఇక్కడ ఏర్పాటు చేస్తే ఇక్కడి విద్యార్థులకు ఎక్కువగా ఆ రంగాల్లో ఉద్యోగాలు వస్తాయి.

జిల్లాలో మూడు ఇంజనీరింగ్ కళాశాలలు

జిల్లాలో ప్రధానంగా మూడు ఇంజనీరింగ్ కళాశాలలతో పాటు విశ్వవిద్యాలయం ఉంది. ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఈఈఈ, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్, సివిల్ ఇంజనీరింగ్ కోర్సులు ఉన్నాయి. విశ్వవిద్యాలయంలో ఎంసీఏ, ఎమ్మెస్సీ కంప్యూటర్స్‌తో పాటు ఇతర కంప్యూటర్ కోర్సులు కొనసాగుతున్నాయి. పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఇక్కడ వాటి శాఖలను ఏర్పాటు చేస్తే వారికి అవసరమైన మానవవనరుల దొరికే పరిస్థితి లేకపోవడం వల్ల ఇక్కడికి రావడం లేదు. కొత్తగా వస్తున్న డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, నానో టెక్నాలజీ, ఇతర రంగాలకు చెందిన నిపుణుల కొరత ఎక్కువగా ఉంటుందని ఆ కంపెనీలు జిల్లాలకు చెందిన ఐటీ హబ్‌లో పెట్టేందుకు మొగ్గు చూపడం లేదు. గత ప్రభుత్వ హయాంలో యూఎస్, ఆస్ట్రేలియాకు చెందిన కొన్ని కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నా ఒక్కటి కూడా ఇక్కడ బ్రాంచ్‌ని ఏర్పాటు చేయలేదు. ఎవరూ ముందుకు రావడం లేదు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా ఐటీ హబ్‌ను వినియోగించుకొని కంపెనీలు తీసుకు వచ్చేందుకు కొంత ప్రయత్నాలు జరిగినా ఇప్పటి వరకు ఏ కంపెనీ రాలేదు. పెద్ద కంపెనీలు మొగ్గు చూపడం లేదు. ప్రధానంగా ఇన్ఫోసిస్, టెక్ మహీంద్ర, డెల్, టీసీఎస్, విప్రోతో పాటు మైక్రోసాఫ్ట్ వంటి పెద్ద కంపెనీలన్నీ మెట్రోసిటీలోనే పెట్టేందుకు మొగ్గు చూపుతున్నాయి. ఐఐటీ, ఎన్ఐటీ, పెద్ద పేరున్న ఇంజనీరింగ్ కళాశాలలు, కంపెనీలు ఉన్న ప్రాంతంలో పెడితే వారికి కావాల్సిన వనరులు కూడా అందుబాటులో ఉండటంతో ఎక్కువగా హైదరాబాద్, బెంగ్లూర్‌లోనే ఆ కంపెనీలు నెలకొల్పనున్నట్లు ఐటీ హబ్‌కు చెందిన కొంత మంది అధికారులు తెలిపారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నేతలు ప్రభుత్వం ద్వారా ప్రయత్నాలు చేస్తున్న ఫలితం మాత్రం ఉండటం లేదు. ఈ ఐటీ హబ్‌లో పేరున్న పెద్ద కంపెనీలు రాకున్నా మధ్యతరహా కంపెనీలను తీసుకువచ్చి సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన కార్యక్రమాలను నిర్వహిస్తే ఇక్కడి విద్యార్థులకు ఉద్యోగాలు స్థానికంగా దొరికే అవకాశం ఉంది. సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన కంపెనీలు కొన్ని వస్తే ఉపాధి కూడా పెరిగే అవకాశం ఉంది. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు ఆ దిశలో దృష్టి పెడితే కొన్ని కంపెనీలు వచ్చే అవకాశం ఉంది. ఐటీహబ్‌లో కొత్త కంపెనీలను తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని రాష్ట్ర ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ అధికారులు తెలిపారు. త్వరలోనే కొన్ని కంపెనీలు వచ్చే అవకాశం ఉందని వారు తెలిపారు.

కొనసాగుతున్న సీఎం కప్ క్రీడా పోటీలు

సుభాష్‌నగర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో సీఎం కప్ క్రీడా పోటీలు కొనసాగుతున్నాయి. బుధవారం కిక్ బాక్సింగ్ ఎంపికతో పాటు అథ్లెటిక్స్ సైక్లింగ్, ఖోఖో పోటీలను నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన మరియు క్రీడల అధికారి ముత్తెన్న తెలిపారు. 19వ తేదీన యోగా పోటీలు బాల్‌భవన్‌లో, ఆర్చరీ పోటీలు రాజారాం స్టేడియం నాగారంలో, కబడ్డీ పోటీలు ఓల్డ్ కలెక్టరేట్ గ్రౌండ్‌లో, బ్యాడ్మింటన్ పోటీలు ఆఫీసర్స్ క్లబ్‌లో, ఈత పోటీలు సుభాష్‌నగర్ స్విమ్మింగ్ పూల్‌లో నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఉదయం 9గంటలకు పోటీలో పాల్గొనే క్రీడాకారులు నిర్ణీత క్రీడాప్రాంగణాలకు చేరుకోవాలని క్రీడల అధికారి ముత్తెన్న తెలిపారు.



జెండా ఊపి సైక్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం



పరుగు పందెం పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

'విద్యార్థులకు సెల్‌ఫోన్లు ఇవ్వొద్దు'

కోటగిరి,డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థికి ఇంటర్ విద్య ఎంతో కీలకమైందని, విద్యార్థులకు సెల్‌ఫోన్‌లు ఇవ్వకుండా తల్లిదండ్రులు చదువుపై దృష్టి సారించేలా కృషి చేయాలని కోటగిరి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కైసర్ పాషా సూచించారు. కోటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రతిరోజు కళాశాలకు వచ్చే విధంగా తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. పరీక్షల షెడ్యూల్ విడుదల కావడంతో విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలకు వచ్చి అధ్యాపకులు బోధించే పాఠ్యాంశాలు విని కష్టపడి చదివేలా తల్లిదండ్రులు ప్రోత్సాహించాలని కోరారు. అనంతరం ఇంటర్మీడియట్ బోర్డు అధికారుల ఆదేశానుసారం కళాశాలలో హార్ట్ ఫుల్ నెస్, మెడిటేషన్, యోగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ప్రమోద్, దత్తాత్రి, అయేషా, షాదుల్లా, ప్రభాకర్, హసన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

చలి తీవ్రత నుంచి నారుమడులను కాపాడుకోవాలి

నవీపేట,డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): యాసంగి పంటకు సంబంధించి వరినారు మళ్లను చలి తీవ్రత నుండి కాపాడుకోవడానికి రైతులు తగిన చర్యలు తీసుకోవాలని ఏవో నవీన్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని నిజాంపూర్‌లో వరినారు మళ్లను ఆయన పరిశీలించారు. రాత్రిపూట నారుమళ్లల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, చలి తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో నారుమడి చుట్టు ఒక అడుగు ఎత్తులో పలచటి పాలిథిన్ షీటు గాని ఖాళీ ఎరువుల సంచులతో కుట్టిన పట్టాలను గాని సాయంత్రం వేళలో కప్పి ఉంచి ఉదయం పూట తీసివేయాలని సూచించారు. రాత్రి ఉష్ణోగ్రత్తలు 10డిగ్రీల కంటే తగ్గినప్పుడు చలి తీవ్రత పెరిగి నారు ఎర్రబడడం, సరిగ్గా ఎదగకపోవడం, పంటకాలం పెరిగిపోవడం ముఖ్యంగా జింక్ పోషక లోప లక్షణాలు కనిపించే అవకాశం ఉంటుందని అన్నారు. నారుమళ్ల రక్షణకు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏవో సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో వసంత్, పలువురు రైతులు పాల్గొన్నారు.

బస్సు యాత్రను విజయవంతం చేయాలి

సుభాష్‌నగర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్‌లో గురువారం నిర్వహించనున్న బస్సు యాత్రను విజయవంతం చేయాలని సిఐటీయు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ పిలుపునిచ్చారు. సిఐటీయు కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆశావర్కర్ల సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్ర జరుగుతుందన్నారు. ఆ యాత్ర గురువారం జిల్లా కేంద్రానికి చేరుకుంటుందన్నారు. బస్సుయాత్ర సందర్భంగా ఆశావర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఆశావర్కర్లను అన్ని పనులకు ఉపయోగిస్తూ వారి శ్రమకు తగిన జీతాలను మాత్రం ఇవ్వడం లేదని ఆమె ఆరోపించారు. సబ్‌సెంటర్స్‌లో ఉదయం నుంచి 4గంటల వరకు పనిచేస్తున్నా వారికి వేతనాలు మాత్రం నామమాత్రంగా ఇస్తున్నారని అన్నారు. రోగులకు బిపి, షుగర్ టెస్టులు చేయడంతో పాటు కంటివెలుగు, సమగ్ర సర్వే, ప్రజాపాలన సర్వేతో పాటు ఇతర ప్రభుత్వ కార్యక్రమాలన్నింటిలో పాల్గొంటున్నారని అన్నారు. ఇవన్నీ చేస్తున్న వారికి టిఏ, డిఏలు ఇవ్వడం లేదన్నారు. జీతాన్ని ఇచ్చిన హామీ ప్రకారం 18వేలకు పెంచడం లేదని విమర్శించారు. పనికితగ్గ వేతనాన్ని వారికి ఫిక్స్ చేయాలని డిమాండ్ చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతం చేయాలి

భిక్కనూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతం చేయాలని అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని బస్వాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల సర్వేలో బాగంగా లబ్దిదారుల పూర్తి వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా యాప్‌లో నమోదు చేయాలన్నారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, గ్రామకార్యదర్శి దయాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

పల్లెలను కుదేలుచేస్తున్న గుడుంబా మహమ్మారి

- బానిసలవుతున్న పల్లె ప్రజలు
- పెద్ద దిక్కును కోల్పోయి వీధిన పడుతున్న కుటుంబాలు
- పట్టించుకోని ఎక్సైజ్ శాఖ



బాన్సువాడ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పచ్చటి పల్లెలను గుడుంబా మహమ్మారీ పట్టి పీడిస్తోంది. కొంత మంది అక్రమార్కులు పని కట్టుకొని గుడుంబాను రహస్య స్థావరాల్లో తయారు చేస్తున్నారు. అనంతరం దానిని ప్యాకెట్లలో నింపుతూ పల్లె ప్రజలకు చౌక ధరలకే విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. నాటు సారా తాగడం వల్ల పల్లె ప్రజలు తమ ప్రాణాల మీదకు తెచ్చుకుంటూ తమ జీవితాలను కుదేలు చేసుకుంటున్నారు. తీరా కుటుంబంలో పెద్ద దిక్కు కోల్పోయి ఎన్నో కుటుంబాలు వీధి పాలు అవుతున్నాయి. పల్లెల్లో నాటుసారా తయారు చేస్తూ విక్రయిస్తున్నారని అధికారులకు సమాచారం అందించడం, అధికారులు వారిని పట్టుకవచ్చి అందినకాడికి దండుకొని వారిని వదిలిపెట్టడం రివాజుగా మారింది. జిల్లాలో ఏ పల్లె చూసిన, ఏ తండా చూసిన గుడుంబాతో గుప్పుమంటున్నాయి. నిద్ర లేచిన్నుంచి రాత్రి పడుకునే వరకు పల్లె ప్రజలు గుడుంబాను సేవిస్తూ బానిసలవుతున్నారు. పల్లెల్లో, తండా శివారులోని పంట పొలాల్లో చెఱుకు తోట చేనులను, మొక్కజొన్న చేనుల వద్ద గుడుంబా బట్టీలను రహస్యంగా ఏర్పాటు చేస్తున్నారు. రాత్రి వేళల్లో గుడుంబా బట్టీల నుంచి నాటుసారాను పల్లె ప్రాంతాలకు తరలించి ప్యాకెట్లలో విక్రయిస్తున్నారన్న సమాచారం వినబడుతుంది. కొందరు గుడుంబా వ్యాపారం చేసే వ్యక్తులు పల్లె ప్రజలను బానిసలు చేసి గుడుంబా మత్తును దించి వారి జీవితాలతో చెలగాటమాడుతున్నారు. నిత్యం గుడుంబాకు బానిసైన ప్రజలు ఇంట్లో కుటుంబాన్ని పోషించలేక రోడ్డున పడుతూ వారి కుటుంబాలు చిందర బందరంగా అవుతున్నాయి. గుడుంబాకు బానిసైన కుటుంబాల్లో పెద్ద దిక్కు కోల్పోయి కుటుంబాన్ని పోషించుకోలేని స్థితిలో కొన్ని కుటుంబాలు ఉన్నాయంటే గుడుంబా మహమ్మారి ఎంత వ్యాపిస్తుందో ఇట్టే అర్థమవుతుంది. ఇన్నీ సంఘటనలు జరుతున్నా ఎక్సైజ్ శాఖ మాత్రం నివారించకుండా కళ్లు అప్పగించి చూడడం బాధాకరం. జిల్లాలోని బాన్సువాడ నియోజకవర్గంలోని వర్ని మండలంలోని తండాల్లో జోరుగా గుడుంబా వ్యాపారం సాగుతోంది. బాన్సువాడ మండలంలోని పలు తండాల్లో, జుక్కల్ నియోజకవర్గంలోని తండాలతో పాటు గాంధారి మండలంలోని తండాల్లో గుడుంబా గుప్పుమంటుంది.

గుడుంబా నివారణకు కఠిన చర్యలు..

: ఎక్సైజ్ సీఐ యాదగిరిరెడ్డి

గుడుంబా విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ యాదగిరి రెడ్డి అన్నారు. గతంలో గుడుంబా నివారణకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి దాడులు చేపట్టి కేసులు నమోదు చేశారు. ప్రస్తుతం గుడుంబా కొనసాగితే ఎలాంటి సమాచారం అందించిన కేసు నమోదు చేసి వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చక్కెర ఫ్యాక్టరీలను తెరిపించాలి

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చక్కెర ఫ్యాక్టరీలను తెరిపించాలని సిపిఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. జిల్లాలోని నిజామాబాద్ సహకార చక్కెర కర్మాగారంతో పాటు బోధన్ చక్కెర కర్మాగారాలను తెరిపించాలని వారు డిమాండ్ చేశారు. చక్కెర కర్మాగారాలు మూతపడటం వల్ల చెరుకు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య అన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు నిజాంషుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వమే స్వాధీనం చేసుకొని వెంటనే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. చెరుకు పంట ఎవరూ వేయడానికి అవసరమైన అడ్వాన్స్‌లను రైతులకు ఇవ్వాలన్నారు. నిజామాబాద్ నగరాన్ని ఆనుకొని ఉన్న సారంగపూర్ చక్కెర కర్మాగారాన్ని బెల్లం పరిశ్రమగా మార్చి వెంటనే ప్రారంభించాలన్నారు. రైతులకు ప్రోత్సహాలు అందించి చెరుకు సాగు చేసే విధంగా చూడాలన్నారు. రైతులు పండించే పంటలకు ఎంఎస్‌పి గ్యారంటీ ఇచ్చి రుణమాఫీ పూర్తిస్థాయిలో చేయాలన్నారు. ఈ ధర్నాలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య, రైతు నాయకులు ఎఫ్‌పివో చైర్మన్ ముత్యాల నాగయ్య, దేశెట్టి సాయరెడ్డి, బి.సాయిలు, పర్వయ్య, ఎర్రన్న, దేవన్న, కృష్ణగౌడ్, బన్నీ, మార్క్స్, బాబురావు, శ్రీనివాస్‌రెడ్డి, ఆకుల అరుణ, సుప్రియ, లక్ష్మి పాల్గొన్నారు.

డ్యూయల్ డెస్క్ బెంచీల పంపిణీ

రెంజల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలా ప్రభుత్వ పాఠశాలకు డ్యూయల్ డెస్క్ బెంచీలను వసంత టూల్స్ యాజమాని దయానంద్ రెడ్డి, నాగేశ్వర్ రావులు పాఠశాలకు బహుకరించారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఉండేందుకు డ్యూయల్ డెస్క్ బెంచీలను అందజేయడం జరిగిందన్నారు. డ్యూయల్ డెస్క్‌లను అందించిన దయానంద్ రెడ్డి, నాగేశ్వర్ రావులను పాఠశాల సిబ్బందితో పాటు ప్రధానోపాధ్యాయుడు శంకర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఆంజనేయులు, పీఆర్‌టీయూ అధ్యక్ష, కార్యదర్శులు సోమలింగం గౌడ్, కిషోర్ కుమార్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీరామ్ తదితరులున్నారు.

బీఆర్ఎస్ నాయకులకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

భిక్కనూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ నాగభూషణం, దమ్మయ్యగారి సంజీవరెడ్డి ఇటీవల అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందగా వారిని మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్ బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారి క్షేమసమాచారాలను అడిగి తెలుసుకుని వారికి ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాగభూషణం, సంజీవరెడ్డికి తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విండో చైర్మన్ భూంరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ యాదగిరి, సర్పంచ్ తునికి వేణు, నాయకులు శ్రీనివాస్, ముదాం సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని కోరుతూ కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను బుధవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దహనం చేశారు. నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి విఘ్నేష్ మాట్లాడుతూ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలపై ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ స్పందించాలన్నారు. గత మూడేళ్లుగా జిల్లాకు సంబంధించి 180 కోట్లకు పైగా బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని దీనిపై జిల్లాకు చెందిన పీసీసీ అధ్యక్షుడు స్పందించాలన్నారు. బకాయిలు విడుదల కాక విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమ న్నారు. అధికారంలోకి రాగానే బకాయిలు విడుదల చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటికే విడుదల చేయకపోవడం బాధాకరమన్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించకపోతే భవిష్యత్తులో ఎమ్మెల్సీ ఇంటిని ముట్టడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చక్రి, రాజు, వినిత్, సుజిత్, సుశాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు నూతన బోధన పద్ధతులను పాటించాలి

ముప్కాల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తరగతి గదిలో ఉపాధ్యాయులు నూతన పద్దతులు, సాంకేతికతను ఉపయోగించి విద్యార్థులకు విద్యబోధన చేయాలని ఎం ఈవో బట్టు రాజేశ్వర్ అన్నారు. బుధవారం బాల్కొండ మండలంలోని కిసాన్ నగర్‌లో ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేసి వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ సమాశాల ద్వారా ఉత్తమ విద్యబోధన, ప్రతిభ వంతులైన విద్యార్థులను తయారు చేసే విధంగా ఉప యోగపడుతాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్‌నగర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రాజేంద్రకుమార్, ప్రశాంత్‌రెడ్డి, రామస్వామి, నాగ రాజేందర్, నాగరాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

భీమ్‌గల్, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి): భీమ్‌గల్ పట్టణానికి చెందిన బీఆర్ఎస్ యూత్ టౌన్ ప్రెసిడెంట్ నీలం రవి, బీఆర్ఎస్ యూత్ నాయకులు నరేష్, రాజు, సీహెచ్.రాకేష్, బిట్టు, సురేష్, మహేష్, మజ్జు, అక్రంలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ వారికి కాంగ్రెస్ కండువ వేసి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో జరుగుతున్న ప్రజాపాలనకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షుడు బోదిరె స్వామి, జెజె.నర్సయ్య ఎస్సీసెల్ అధ్యక్షుడు అనంత్‌రావు, మల్లెల లక్ష్మణ్, సురేందర్, విక్రం, పొల్సాని రంజిత్, సాయిబాబా, పల్లె శేఖర్, కోరాడి లింబాద్రి, తదితరులు ఉన్నారు.

చౌట్‌పల్లి విద్యార్థినికి జిల్లాస్థాయిలో బహుమతి

కమ్మర్‌ల్లి, డిసెంబరు 18: (ఆంధ్రజ్యోతి) మండలంలోని చౌట్‌పల్లి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని సభాసాదియా జిల్లస్థాయి బయాలిజికల్ సైన్స్ టాలెంట్ టెస్టులో ద్వితీయ బహుమతిని కైవశం చేసుకుంది. ఈమేరకు జిల్లా కుంద్రంలో డీఈవో అశోక్ చేతులమీదుగా అవార్డుతో పాటు వెయ్యిరూపాయల నగదు పురస్కారాన్ని అందుకుంది. ఇప్పటివరకు మండలస్థాయిలో సైతం ప్రతీ సబ్జెక్టులోను మండల టాపర్‌గా నిలుస్తు వస్తుందని మ్యాథమిటిక్ లో కేడ జిల్లా స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచిందని మండల విద్యాధికారి ఎన్ ఆంధ్రయ్య తెలిపారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

డిచ్‌పల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు భాష అర్థమయ్యేలా బోధించాలని ఓయూ మాజీ హెడ్ కసిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం తెలంగాణ వర్సిటీలో భారతీయ భాష విభాగాల సంస్థ, ఉన్నత విద్యామండలి సంయుక్తంగా తెలుగు అధ్యాపక పునశ్చరణ శిక్షణ తరగతులను ఆరు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఉభయ రాష్ట్రాలనుంచి అధ్యాపకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కసిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. భాషోపాధ్యాయులు తెలుగు భాషను భావితరాలకు అందించాలని ఇందుకు ఇలాంటి శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మైసూరు సివిల్ డైరెక్టర్ ప్రొ.శైలేంద్ర మోహన్, మాట్లాడుతూ.. ఆది మానవుని కాలంలో నాటి నుంచి నేటి వరకు తెలుగు ఏ విధంగా పరిణామం చెందిందో వివిధ భాషల ద్వారా వివరించారు. టీయూ వీసీ ప్రొ.యాదగిరి రావు మాట్లాడుతూ... తెలుగు భాషలోని నూతన పద్య విభాగాన్ని చక్కగా ప్రస్తవించారు. ప్రిన్సిపాల్ ఆరతి మాట్లాడుతూ... తెలుగు భాషకు సాంకేతిక తను జోడిస్తే ప్రపంచంలో ఎక్కడి వారైన తెలుగు ఉపయోగించుకోవచ్చునన్నారు. ప్రొ.లావణ్య మాట్లాడుతూ.. భారతీయ భాషల విభాగాల సంస్థ తెలంగాణ వర్సిటీ తెలుగు విభాగానికి ఈ అవకాశం కల్పించడం గొప్పవిషయమన్నారు. అధ్యాపకులకు, పరిశోధకులకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరమన్నారు. తమతో ఏ విధంగా సాహిత్య మెలకువలు నేర్చుకోవడానికి చక్కని అవకాశం అని పేర్కొన్నారు. అనంతరం వీసీ యాదగిరి రావు ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీఐఎల్ కార్యదర్శి. వెంకటేశ్వర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెరువు నీటిని వదిలిన వ్యక్తికి జైలు

కోటగిరి,డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): కోటగిరి దామర చెరువు తూము ద్వారా నీటిని దొంగతనంగా విడుదల చేసిన ఎండీ సలీం అనే వ్యక్తికి బోధన్ కోర్టు న్యాయమూర్తి మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు 4వేల జరిమాన విధించినట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. 8సంవత్సరాల క్రితం సలీం అనే వ్యక్తి తన పంటపొలం కోసం చెరువు నీటిని అక్రమంగా విడుదల చేయడంతో ఇతర రైతులకు పంట కొయరాకుండా నష్టపరిచాడు రబీ పంటకు నిల్వ నీటిని వదిలేయడంతో రైతులకు నష్టం కలిగించడంతో పాటు అక్కడే గ్రామ సేవకుల విధులకు ఆటంకపర్చాడు. అప్పటి తహసీల్దార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు విచారణలో నిందితుడికి మూడు సంవత్సరాల జైలుశిక్షతో పాటు రూ.4వేల రూపాయల జరిమాన విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

చీటింగ్ కేసులో సంవత్సరంన్నర జైలుశిక్ష

బోధన్‌రూరల్,డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): చీటింగ్ కేసులో మండలంలోని కల్దుర్కి గ్రామానికి చెందిన బొయ్యన్‌వార్ హన్మంతుకు బోధన్ కోర్టు న్యాయమూర్తి ఎం.పూజిత బుధవారం సంవత్సరంన్నర జైలుశిక్షతో పాటు వెయ్యి రూపాయల విధించినట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బోధన్ మండలంలోని కల్దుర్కి గ్రామానికి చెందిన బొయ్యన్‌వార్ హన్మంతుపై 2015లో చీటింగ్ కేసు నమోదు కాగా బుధవారం కోర్టులో విచారణ జరుపగా నేరం రుజువు కావడంతో న్యాయాధికారి సంవత్సరంన్నర జైలుశిక్షతో పాటు రూ.వెయ్యి జరిమాన విధించారని సీఐ వివరించారు.ఈకేసుకు సహకరించిన ఎస్ఐ ప్రభాకర్, సీఐ వెంకట నారాయణ, కోర్టు కానిస్టేబుల్ సృజన్,లక్ష్మణ్‌లను సీపీ అభినందించారని పేర్కొన్నారు.

హత్యకేసులో ముగ్గురి అరెస్టు, రిమాండ్

ఖిల్లా, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి):నగరంలోని ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల మిర్చికంపౌండ్ ప్రాంతంలో ఈనెల 15న జరిగిన హత్య కేసులో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో బి.రఘుపతి తెలిపారు. మిర్చి కంపౌండ్ వద్ద గల ఒక పాన్‌షాప్‌సమీపంలో మృతుడు గైక్వాడ్ చంద్రకాంత్‌ను అడ్డగించి ఘర్షణకు దిగిన రాచకట్ల మనీష్ కుమార్, చిట్లు సాయికృష్ణ, రసకోని రుతిక్‌గౌడ్‌లు దాడిచేశారు. ఈ ఘటనలో చంద్రకాంత్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు చంద్రకాంత్ మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో పలువురిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ విచారణలో ముగ్గురు హత్యచేసినట్లు గుర్తించి వీరిని బుధవారం సాయంత్రం కోర్టు ఎదుట హాజరుపర్చారు. కోర్టు వీరిని రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



గెలుపొందిన ఉద్యోగ సంఘాల నాయకులు

సుభాష్‌నగర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):టీఎన్‌జీవోస్ అర్బన్, రూరల్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్వర్ ఆదేశానుసారం బుధవారం నగరంలోని టీఎన్‌జీవోస్ భవన్‌లో ఈఎన్నిక కార్యక్రమం జరిగింది. ఎన్నికల అధికారులుగా వనమాల సుధాకర్, సంజీవయ్య, దినేష్‌బాబు, విశాల్‌రెడ్డి వ్యవహరించారు. రూరల్, అర్బన్‌కు సంబంధించి అన్ని పదవులకు ఒక్కొక్క నామినేషన్ నమోదు కావడంతో అందరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అర్బన్ అధ్యక్షుడిగా జాకీర్ హుస్సేన్, కార్యదర్శిగా మారుతి, రూరల్ అధ్యక్షుడిగా జ్ఞానేశ్వర్‌రెడ్డి, కార్యదర్శిగా శ్రీనివాస్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరి గెలుపుకు సహకరించిన ప్రతి ఒక్కరికి జిల్లా అధ్యక్షుడు సుమన్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహ అధ్యక్షులు చిట్టి నారాయణరెడ్డి, కేంద్ర బాధ్యులు పోల శ్రీనివాస్, కోశాధికారి దినేష్‌బాబు, ఉపాధ్యక్షుడు మంజుల, అతిక్, సంయుక్త కార్యదర్శులు జాకీర్ హుస్సేన్, మహేందర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రకాశ్, ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ఏర్గట్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం గ్రామానికి చెందిన రుద్రారపు జమునకు రూ.38వేలు, రొక్కెడ సరితకు రూ.19 వేలు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరు చెక్కులను కాంగ్రెస్ నాయకులు అందజేశారు. అనారోగ్యంతో కార్పొరేట్ ఆసుపత్రి వైద్యం చేయించుకోగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు మంజూరీ చేయించిన బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్‌కు బాధిత కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, రెండ్ల రాజారెడ్డి, పన్నాల నర్సారెడ్డి, ఆరెపు మాణిక్యం, కురకుల భూమన్న, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

డొంకేశ్వర్: అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందిన పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులు పోషన్న, గంగామణి, లక్ష్మీ, గంగాధర్, బోజారంలకు బుధవారం డొంకేశ్వర్ మండలం అన్నారం గ్రామంలో బీజేపీ నాయకులతో కలిసి మాజీఎంపీటీసీ సంజీవ్ పంపిణీ చేశారు. చెక్కులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డికి లబ్ధిదారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షుడు వంశీ, బీజేపీ నాయకులు రాము, ప్రవీన్, రాజు, గంగాధర్, గంగసాయిలు, తదితరులు పాల్గొన్నారు.



ఏర్గట్లలో చెక్కులు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కమ్మర్‌పల్లిలో పలు చోట్ల చోరీకి యత్నం

● తులం బంగారం 18 తులాల వెండి ఆభరణాలు చోరీ ● ఒక ద్విచక్రవాహనం ధ్వంసం ● సంఘటన స్థలాలను పరిశీలించిన భీమ్‌గల్ సీఐ

కమ్మర్‌పల్లి, డిసెంబరు 18: (ఆంధ్రజ్యోతి) కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో మంగళవారం అర్ధరాత్రి దొంగతనానికియత్నించారు. గ్రామానికి చెందిన పలు ఇండ్లలో, దుకాణాల్లో సైతం చోరీకి యత్నించారు. తాళాలువేసిన ఇళ్లలో చుట్టపక్కలవారి ఇళ్లకు గొల్లాలు పెట్టి తాళాలు పగులగొట్టి చోరీకి యత్నించారు. కొన్ని ఇళ్లలో దుకాణాల్లో ఏమి దొక్కపోవడంతో వెనుదిరినట్లు తెలిసింది. కాగా పద్మశాలిసంఘం వెనకగల ఆర్ఎంపీ వైద్యుడు రమేష్ ఇంటిముందున్న ద్విచక్రవాహనాన్ని దొంగిలించుకు పోయిన దొంగలు గ్రామశివారులోని వ్యవసాయతోటలవద్ద పడేసి వెళ్లారు వాహనం (స్కూటీ) స్టార్ట్ కాకపోవడంతో దాన్ని ధ్వంసం చేసి అక్కడే పడేసి వెళ్లి నట్లు తెలిపారు. హసాకొత్తూర్ రోడ్డులో గల సిరిగిరి శ్రీనివాస్ ఇంట్లో అద్దెకుంటున్న కలల శ్రీలేఖ ఇంట్లో తులం బంగారం, 18 తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెల్లారని కమ్మర్‌పల్లి ఎస్సై అనిల్ రెడ్డి తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న భీమ్‌గల్ సీఐ నవీన్ కుమార్ బుధవారం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితురాలు శ్రీలేఖ ఫిర్యాదు మేరకు కేసున మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు. ఒక వైపు చలీ, మరోవైపు ఒకే రోజు పలు ఇళ్లలో దొంగలు చోరీలకి యత్నించడంతో గ్రామస్థులు భయంతో గజగజావనికి పోతున్నారు. దొంగలు సుమారు 10 మంది వరకు ఉన్నట్లు గ్రామస్థులు భావిస్తుంది.



చోరీ జరిగిన ఇంట్లో వివరాలు తెలుసుకుంటున్న ఎస్సై అనిల్‌రెడ్డి

చదువు పట్ల శ్రద్ధ చూపించి లక్ష్యాలను సాధించాలి

బోధన్‌రూరల్,డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువు పట్ల శ్రద్ధ చూపించి తాము అనుకున్న లక్ష్యాలను సాధించేలా ప్రయత్నాలు చేయాలని డీహెచ్‌ఈడబ్ల్యూ జిల్లా మిషన్ సమన్వయకర్త స్వప్న అన్నారు. బుధవారం బోధన్‌లోని మధుమలాంచ జూనియర్ కళాశాలలో విద్యార్థిని, విద్యార్థులకు మహిళ శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల జిల్లా శాఖ ఆధ్వర్యంలో మహిళా సాధికారతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి కౌసల్ వికాస్ యోజన కేంద్రంలో యుక్త వయసులో ఉన్న విద్యార్థి, విద్యార్థులకు వృత్తి నైపుణ్యం, విద్యపై శిక్షణ నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందన్నారు. అనంతరం మేనేజర్ మహేష్ మాట్లాడుతూ కేంద్రంలో గల శిక్షణల గురించి అప్లికేషన్ ఫామ్ ఫిల్లింగ్ గురించి క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆసియా, మొబలైజర్ ప్రదీప్, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న స్వప్న

హనుమాన్ మందిర పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి



ఎమ్మెల్యే భూపతిరెడ్డిని కలిసిన కొండాపూర్ కాంగ్రెస్ నాయకులు

సిరికొండ డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) కొండపూర్ గ్రామంలో గల హ నుమాన్ మందిర పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డిని కలిసి కోరారు. సిరికొండ మండలం కొండాపూర్ గ్రామంలో గల పురాతన హనుమాన్ మందిర నిర్మాణానికి ప్రభుత్వం దేవదాయ శాఖ నుంచి రూ.35 లక్షలు మంజూరు చేసిందని కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీధర్, జగన్,కిషోర్‌గౌడ్, దేవాలయ కమిటీ సభ్యులు మోహన్ తదితరులు బుధవారం ఎమ్మెల్యేను కలిశారు. ఆలయ నిర్మాణ పనులు మార్చి తర్వాత ప్రారంభమవుతాయని ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి హామీ ఇచ్చారని నాయకులు చెప్పారు.టెండరు పనులు పూర్తి కాగానే దేవాలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని కాంగ్రెస్ నాయ కులు శ్రీధర్ చెప్పారు.

విధుల నిర్వహణ నిర్లక్ష్యంతో కానిస్టేబుల్ సస్పెండ్

● ఒక కానిస్టేబుల్ సస్పెండ్ ● మరో ముగ్గురికి షోకాజు నోటీసుల జారీ

ఖిల్లా, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):రెంజల్ మండలం వీరన్నగుట్టకు సంబంధించిన వ్యక్తి మృతి కేసులో పోలీసు ఉన్నతాధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు.ఆవ్యక్తి మృతి కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఒక కానిస్టేబుల్‌ను బుధవారం సస్పెండ్ చేశారు. మరో ఇద్దరు కానిస్టేబుళ్లతో పాటు అధి కారికి నోటీసులను జారీ చేశారు. దర్యాప్తును కొనసాగిస్తున్నారు. వ్యక్తి మృతికి సంబంధించిన కేసులో ఇప్పటికే ఏడుగురిని రిమాండ్ చేశారు. ఈ కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు ఫోక్సోకేసు కింద నమోదైన వ్యక్తి స్టేషన్‌లో ఉన్న సమయంలో సరైన విధంగా వ్యవహరించని సిబ్బంది పై చర్యలకు ఉపక్రమించారు. తూప్రాన్ డీఎస్పీతో దర్యాప్తు పూర్తి చేసిన అధికారులు మరికొందరితో చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే నివేదికను రేంజ్ ఐజికి పంపించినట్లు తెలుస్తుంది.

సీజ్ చేసిన ఇసుక డంప్‌ల వేలం

మోర్తాడ్, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఇటీవల సీజ్ చేసిన ఇసుక డంప్‌లను వేలం పాట నిర్వహించారు. మండలంలోని గాండ్లపేట్ పెద్దవాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలించి ఇసుక డంప్‌లను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. సీజ్ చేసిన ఇసుక డంప్‌లను వేలం వేయగా గంగాధర్ అనే వ్యక్తి 150ట్రిప్పుల ఇసుకను రూ.60వేలకు వేలంలో దక్కించుకున్నారు. తహసీల్దార్ సత్యనారాయణ, ఎంఆర్ఐ రంజిత్‌కుమార్ వేలం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సత్యనారాయణ మాట్లాడుతూ వాగుల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత

ఖిల్లా,డిసెంబరు18(ఆంధ్రజ్యోతి):నగరంలోని నాల్గోటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో వివిధ కారణాలతో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను బుధవారం ఎస్ఐ శ్రీకాంత్ వారికి అప్పగించారు. వివిధ కారణాలతో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వాటిని సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించినట్లు ఎస్ఐ తెలిపారు. స్వాధీనం చేసుకున్న మొత్తం తొమ్మిది సెల్‌ఫోన్లను తన చాంబర్‌లో అప్పగించారు.

అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశా లలో ఉర్దూ మీడియంలో చరిత్రను బోధించడానికి అతిథి.అధ్యాపకుల పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.వేణుప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పీజీ చరిత్రలో 55శాతం మా ర్కులు కలిగిన వారు, నెట్, సెట్, పీహెచ్‌డీ ఉన్న వారికే ప్రాధాన్యత ఉంటుందని ఆయన తెలిపారు. ఈనెల 20వ తేదీలోపు కళాశాలలో దరఖాస్తులను సమర్పిం చాలన్నారు.

పడకల్‌లో జాతీయస్థాయి క్రీడాకారులకు సన్మానం

జక్రాన్‌పల్లి, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి అండర్-14 వాలీబాల్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు రిత్విక్, చందనలు బుధవారం మండలంలోని పడకల్ పాఠశాల హెచ్‌ఎం గడ్డం సురేందర్‌రెడ్డి సన్మా నించారు. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో ఈనెల 10నుంచి 14వ తేదీ వరకు జరిగిన జాతీయస్థాయి అండర్-14 వాలీబాల్ పోటీల్లో చందన పా ల్గొని ప్రతిభ కనబరిచారు. జమ్ముకాశ్మీర్‌లోని గాంధీనగర్‌లో జరిగిన జాతీయ స్థాయి సబ్‌జూనియర్ టెన్నికాయిట్ పోటీల్లో రిత్విక్ పాల్గొని ప్రతిభ కనబరిచారు.ఈ కార్యక్రమంలో వ్యాయమ ఉపాధ్యాయుడు గడ్డం శ్రీనివాస్, కాంప్లెక్స్ ఉపాధ్యా యులు, వీడీసీసభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



జాతీయస్థాయి క్రీడాకారులను సన్మానిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

గుంతలమయంగా రహదారి



రోడ్డుపై ఏర్పడ్డ గుంత

మోస్రా, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చందూర్ మండల కేంద్రం నుంచి కారేగావ్, లక్ష్మాపూర్, మేడిపల్లి గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా గుంతలమయంగా మారింది. మండల కేంద్రానికి పలు రకాల పనుల కోసం తరచూ ఆయా గ్రామస్థులు వస్తూ ఉంటారు. అదే విధంగా జిల్లా కేంద్రానికి, బాన్సువాడ, వర్ని, బోధన్ వెళ్లేందుకు చందూర్ చేరుకోవాలి. చందూర్ నుంచి నిజామాబాద్, బాన్సువాడ నాలుగు లైన్ల ప్రధాన రహదారి నుంచి జిల్లా కేంద్రానికి, నియోజకవర్గ బాన్సువాడకు వెళ్లేందుకు ఇదే రోడ్డు ఏకైక మార్గంగా ఉంది. చందూర్ మండల కేంద్రం నుండి మేడిపల్లి వెళ్లే రోడ్డులో అడుగడుగునా గుంతలు ఉన్న కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికే చాలా మంది వాహనదారులు చేతులు, కాళ్లు విరిగి తల పగిలిన సంఘటనలు ఉన్నాయి. అయినా సంబంధిత అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ రోడ్డుకు మోక్షం కలిగేదెప్పుడో అధికారులకే తెలియాలి అని గ్రామస్థులు విచారం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై వెళ్లాలంటే ప్రాణభయంతో వెళ్తున్నారు. రోడ్డుపై గుంతలు పూడ్చి వేయాలని ప్రజలు కోరుతున్నారు.

● నిధులు మంజూరయ్యాయి
- జియాన్, ఆర్ అండ్ బీ ఏఈ

చందూర్ నుంచి కారేగాం గ్రామం వరకు డబుల్ రోడ్డుకు నిధులు వచ్చాయి. అందుకనే గుంతలు పూడ్చలేకపోతున్నాం. త్వరలోనే రోడ్డు పనులు ప్రారంభిస్తాం.

ప్రమాదకరంగా మారిన మంజీరా వంతెన

● పొంచి ఉన్న ప్రమాదాలు ● చలనం లేని అధికార యంత్రాంగం ● వంతెన పైనుంచి వెళ్లాలంటే భయం


వంతెనపై నిలిచిపోయిన డీసీఎం వ్యాన్ పక్క నుంచి వెళుతున్న లారీ

నిజాంసాగర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): హై లెవెల్ వంతెన అంటేనే భయం భయం. ఈ వంతెనపై ఎప్పుడు ఏ వాహనం చెడిపోతుందనేది తెలియదు. ఆదమరిస్తే ప్రమాదానికి గురైనట్లే. నిజాంసాగర్ మండల కేంద్రానికి ఆమడ దూరంలో మంజీరా నదిపై నిర్మించిన హై లెవెల్ వంతెన నిర్మాణం చేసి 2023లో జాతికి అంకితం చేశారు. ఈ వంతెనపై తరచుగా వాహనాలకు సాంకేతిక లోపాలు రావడంతో వాహనాలు వంతెనపై మొరాయిస్తున్నాయి. వాహనాలు నడిపే డ్రైవర్లు నిలిచి పోయిన వాహనానికి ఎలాంటి ప్రమాద సూచికలు రోడ్డుపైన పెట్టకుండా ఉండడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇటీవల కాలంలో ఓ లారీ చెడిపోవడంతో ఆగి ఉన్న లారీకి మండలపై కేంద్రానికి చెందిన ఇరువురు ఢీకొని తీవ్ర గాయాలు కాగా ద్విచక్ర వాహనం నుజునుజ్జు అయింది. బుధవారం అదే వంతెనపై డీసీఎం వ్యాను చెడిపోవడంతో వంతెనపై మొరాయించింది. ఈ వ్యాన్ తొలగించేందుకు రోడ్డు భవనాల శాఖ, పోలీసులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తూ ఉన్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.. బుధవారం సాయంత్రం వరకు కూడా ఈ వ్యాను తొలగించలేక పోవడంతో వాహనాలు ప్రజలు అనేక ఇబ్బందులు గురయ్యారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం వంతెనపై వాహనాలు మొరాయిస్తే క్రేన్ ద్వారా తొలగించేందుకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఎల్లారెడ్డి వసతి గృహంలో నీటి కష్టాలు

● మిషన్ భగీరథ నీళ్లు రాక విద్యార్థినుల అష్టకష్టాలు


బయట నుంచి వసతి గృహానికి బకెట్లో నీటిని తీసుకెళుతున్న బాలికలు


మున్సిపల్ నల్ల వద్ద నీటిని బకెట్‌లో పట్టుకుంటున్న దృశ్యం

ఎల్లారెడ్డి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వసతి గృహాల్లోని విద్యార్థులకు కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం లేవగానే కాల కృత్యాలు తీర్చుకునేందుకు నీరు లేక బకెట్లు పట్టుకొని బయటకు వెళ్లి తెచ్చుకుంటున్నారు. ఎల్లారెడ్డి బీసీ బాలికల వసతి గృహంలో వారం రోజులుగా భగీరథ నీరు సక్రమంగా రాకపోవడంతో విద్యార్థులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. చల్లని చలిలో బకెట్లు తీసుకొని ఎర్రమన్నకుచ్చ ప్రాంతంలో ఉన్న వాటర్ ట్యాంక్ వద్ద నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. నీటి సమస్యపై అధికారుల దృష్టికి తీసుకెళ్లగా ట్యాంకర్ పంపినా నీరు సరిపోవడం లేదు. అధికారులు స్పందించి వసతి గృహంలో శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఫలితాలు మెరుగుపడేలా చర్యలు

ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు


జూనియర్ కళాశాల ఆవరణలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న అధ్యాపకులు

మద్నూర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను రూపొందించింది. 90 రోజుల ప్రత్యేక ప్రణాళికతో ఆయా కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి ఫలితాలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని ఆయా జిల్లాల అధికారులను ప్రభుత్వ ఆదేశించింది. దీంతో కళాశాలలో అధ్యాపకులు ఇప్పటికే ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు.

● కామారెడ్డి జిల్లాలో..

కామారెడ్డి జిల్లాలో ఇంటర్ విద్యా బోధన జరిగే ప్రభుత్వ రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్, కేజీబీవీ, ప్రైవేట్, మైనార్టీ కలిపి 86 కళాశాలలు ఉన్నాయి. వాటిలో ప్రభుత్వ కళాశాలలు 20, కేజీబీవీ, మైనార్టీ 48, ప్రైవేట్ 18 ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా ఇంటర్ మొదటి సంవత్సరంలో 7512 మంది విద్యార్థులు, ఇంటర్ రెండో సంవత్సరంలో 1097 విద్యార్థులు ఉన్నట్లు ఇంటర్ నోడల్ అధికారి సలాం తెలిపారు. కళాశాలల ప్రిన్సిపాల్ ప్రతీరోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించే బాధ్యత తీసుకున్నారని వెల్లడించారు. విద్యార్థులకు ఉత్తీర్ణత శాతం పెంచేందుకు 90 రోజుల ప్రణాళికలో భాగంగా ప్రతీరోజు ఉదయం 9 గంటల నుంచి 9.45 వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. డిసెంబరు చివరి నాటికి ఇంటర్ సిలబస్ మొత్తం పూర్తి చేయాలని జనవరి, ఫిబ్రవరి, నెలలో స్లిప్ టెస్ట్ నిర్వహించాలని. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి వారికి సులభంగా అర్థమయ్యే విధంగా చూడాలని ప్రభుత్వం ఆదేశించింది.

● తల్లిదండ్రులకు అవగాహన

ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రతీ 20 రోజులకు ఒకసారి కళాశాలల్లో చదివే విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి తగు సూచనలు చేస్తూ ఉండాలని ఇంటి వద్ద ఉన్న సమయంలో విద్యార్థులు ఏం చేస్తున్నారనే విషయాన్ని కచ్చితంగా గమనించాలని సెల్ ఫోన్లకు దూరంగా ఉంచేలా చూడాలని అవసరమైతే కళాశాలకు వచ్చి విద్యార్థి ప్రోగ్రెస్ చూసుకోవాలని సూచిస్తున్నారు. ఉమ్మడి మద్నూర్ మండలంలో ఉన్న కళాశాలలో ఉత్తీర్ణత శాతం పెంచే విధంగా కృషి చేస్తామని ఆయా కళాశాలల ప్రిన్సిపాల్‌లు నొక్కి చెప్తున్నారు. ఏది ఏమైనా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని 90 రోజుల ప్రణాళిక సిద్ధం చేయడంపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● పిల్లలకు ఎంతో ఉపయోగం

పత్యేక తరగతులు పిల్లలకు బాగా చదివేందుకు ఉపయోగపడతాయని విద్యార్థుల తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. ప్రత్యేక తరగతుల వల్ల మార్కులు పెరుగుతాయని పిల్లలకు అల్పాహారం అందిస్తే బాగుంటుందని అంటున్నారు.

● ఉత్తీర్ణత శాతం పెంచేందుకు కృషి..



పభుత్వం 90 రోజుల ప్రణాళిక ద్వారా ఇంటర్ కాలేజీల్లో మెరుగైన ఫలితాలు సాధించాల ని ఆదేశాలు జారీ చేసింది. అందుకు అనుగుణంగానే జిల్లాలో ఉన్న 86 కాలేజీల అధ్యాపకులకు ప్రతీరోజు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశాం. అన్ని కళాశాలలో ఈ తరగతులు కొనసాగుతున్నాయి. వెనుకబడి ఉన్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధతో తరగతులను నిర్వహిస్తున్నాం. కామారెడ్డి జిల్లాలో గత ఏడాది రాష్ట్రంలో వెనుకబడి ఉంది. ఈసారి 80 శాతం నుంచి 90 శాతం వరకు ఉత్తీర్ణత సాధిస్తాం.

- షేక్ సలాం ఇంటర్ నోడల్ అధికారి కామారెడ్డి

మహిళా సంఘాలకు.. రూ.50 లక్షల వరకు సబ్సిడీ రుణాలు


రుణాలపై మంజూరుపై సమావేశమైన మహిళా సంఘాల సభ్యులు

● మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం

భీమ్‌గల్‌రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి కేంద్ర ప్రభుత్వం (పీఎంఎఫ్ఎంఈ) ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార ఉత్పత్తి తయారీ సంస్థ వ్యవస్థీకరణ పథకం ప్రవేశ పెట్టిందన్నారు. ఈ పథకంలో తీసుకున్న రుణాలకు రూ.50లక్షల వరకు సబ్సిడీని కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని ఈ స్కీంలో గానుగ నూనె, దాల్‌మిల్లులు, పిండిగిర్ని, కారంగిర్ని, అల్లం, ఎల్లిగడ్డ పేస్టులు చేసే మిషన్‌లు కొనుగోలు చేయడానికి ఈ పథకం వర్తిస్తుంది. పాడి పరిశ్రమకు గొర్రెలు, మేకల పెంపకం, పందుల పెంపకం, నాటు కోళ్ల పెంపకం కోసం సబ్సిడీ వర్తిస్తుందని, ఇవే కాకుండా ఐకెపీ మహిళా సంఘాలకు సీడ్ ఫండ్ న్యూ ఎంటర్‌ప్రైజెస్, ఎగ్రిస్ట్, ఎంటర్ ప్రైజెస్, మహిళ శక్తి క్యాంటిన్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, కుట్టు మిషన్ కేంద్రాలకు కూడా ప్రభుత్వం సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తుందన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే ప్రతీ మహిళా సంఘానికి ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పిస్తుందన్నారు.

సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి..
● పప్పుల రవీందర్, ఐకెపీ ఏపీఎం



ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార ఉత్పత్తి తయారీ సంస్థ వ్యవస్థీకరణ పథకంపై మండలంలోని అన్ని గ్రామాల మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పిస్తున్నాం. అలాగే సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి. ప్రతీ మహిళ తప్పకుండా సంఘాల్లో చేరి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వినియోగించుకోవాలి. ఈ పథకాలపై ఎటువంటి సందేహం ఉన్న ఐకెపీ కార్యాలయంలో సీసీలను సంప్రదించాలి.



జాన్కంపేట్‌లో ఈత చెట్టుకు కొమ్మకొమ్మకు అల్లుకున్న పిచ్చుక గూళ్లు

కొమ్మకొమ్మకో.. పిట్టగూడు

వేల్పూర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కొమ్మ కొమ్మకో సన్నాయి.. కోటి రాగాలు ఉన్నాయి అనే పాటను నిజం చేస్తూ వేల్పూర్ మండలం జాన్కంపేట్ గ్రామంలో ఈత చెట్టుకు పిచ్చుకలు కొమ్మకొమ్మకో పిట్ట గూడు కట్టాయి. ఈత కమ్మల నుంచి నారాలు చీరుతూ చెట్టుపై కొమ్మ కొమ్మకో పిట్ట గూళ్లు అల్లుకున్నాయి. ఇలా ఈ గూళ్లు దారినపోయే వారిని ఆకర్షిస్తున్నాయి.

రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు

హసాకొత్తూర్ విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కమ్మర్‌పల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండంలోని హసాకొత్తూర్ పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థులు సంగీత, ప్రతిభ, ఉదయ్ సీఎంకప్ హ్యాండ్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయినట్లు ప్రధానోపాధ్యాయులు బుస కృష్ణ కుమార్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఈ విద్యార్థులు అద్భుత క్రీడా ప్రతిభను కనబర్చగా వీరిని రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. త్వరలోనే వరంగల్ నిర్వహించే రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో జిల్లా జట్టుతరఫున ఆడనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను, పీడీ మాధురిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస మూర్తి, నరేందర్, షేక్ జాన్ పాష, శ్రీనివాస్ దాసు విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి శివ మార్కండేయ మందిర ఉత్సవాలు

● శివమాల వేసుకున్న భక్తులు ● రేపు శివపార్వతుల కల్యాణం


ఆలయంలోని గర్భగుడిలోని శివ మార్కండేయుడు


ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం



ఆలయంలో భజన చేస్తున్న భక్తులు

ఏర్గట్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శివ మార్కండేయ మందిర ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. దేవాలయ నిర్మాణం పూర్తి చేసుకొని సంవత్సరం కావడంతో మొదటి వార్షికోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు పూర్తి చేశారు. పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాలు రెండు రోజుల పాటు జరుగనున్నాయి.

ఆలయ విశిష్ఠత

శివ మార్కండేయ మందిరం గత సంవత్సరం నిర్మాణ పనులు పూర్తి చేసుకొని వైభవంగా ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహించారు. అందులో భాగంగా ఆలయంలోని గర్భగుడిలో శివ మార్కండేయుడితో పాటు శివలింగం, గణపతి, సూర్య భగవానుడు, అన్నపూర్ణదేవి, శివ పార్వతులు ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద నగవగ్రహ విగ్రహాలను గ్రామానికి చెందిన తుపాలకుల శ్రీనివాస్ గౌడ్ దంపతులు దాతగా నిర్మాణం చేయించారు. ఆలయంలోని శివ లింగానికి ప్రతీ రోజు అభిషేకం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేస్తారు. ఈ ఆలయం గ్రామంలో మధ్యలో ఉండి ఆధ్యాత్మికతను నిదర్శనంగా ఉండటం ప్రత్యేకత. అంతే కాకుంగా ప్రతీ సోమవారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే భజన కార్య క్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి పాటలు ఆలపిస్తారు. అంతే కాకుండా పండుగ పర్వదినాల్లో ఆలయం వద్ద కార్తీక మాసం దీపారధన, మహా శివరాత్రి, మార్కండేయ జయంతిని ఘనంగా నిర్వహిస్తారు. అలాగే వార్షికోత్సం ఉత్సవాల సమయంలో, మహా శివరాత్రికి శివ భక్తులు శివ మాలధారణ స్వీకరిస్తారు.

ఉత్సవాల వివరాలు

పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శతాధిక ప్రతిష్ఠాపనచార్యుడు గురుమంచి చంద్రశేఖర్ శర్మ, ఆలయ అర్చకుడు రాజేష్ మంత్రోశ్చరణల నడుమ నేడు ఆలయం వద్ద ఉదయం 8 గంటలకు భగవత్ ప్రార్థన, విశేష సంకల్పం, మహా గణపతి పూజ, స్వస్తి పుణ్య హవచనం, రక్షా బంధనం, అంకురారోపణం, యాగశాల ప్రవేశం, యాగశాల సంస్కారం, వాస్తు పూజ, క్షేత్రపాలక, నవగ్రహ, యోగిని, సర్వతోభద్ర, మండల స్థాపన, హోమం, రుద్ర హోమం, స్వామి వారికి విశేష అర్చన, హారతి, తీర్థ ప్రసాదాల వితరణ. రెండో రోజు శుక్రవారం ప్రార్థనలు, నిత్యవిధి, నిత్య హోమం, బలి ప్రదానం, పూర్ణాహుతి, కుంభ ప్రోక్షణ, శివపార్వతుల కల్యాణ మహోత్సవం, ఆశీర్వచనం కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

నేటి నుంచి వార్షికోత్సవాలు
● గురుమంచి చంద్రశేఖర్ శర్మ, శతాధిక ప్రతిష్ఠాపనాచార్యుడు



మండల కేంద్రంలోని శ్రీ శివ మార్కండేయ మొదటి వార్షికోత్సవ ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. అందులో భాగంగా నేటి ఉదయం నుంచి శుక్రవారం రెండు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో మండలంలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని స్వామి వారి కృపకు పాత్రులై విజయవంతం చేయాలని కోరుతున్నాము.

వైభవంగా మల్లన్న స్వామి ఆలయ వార్షికోత్సవాలు


అగ్నిగుండం వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న యాదవ సంఘాల సభ్యులు

కమ్మర్‌పల్లి డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బషీరాబాద్ దూలగుట్టపై కొలువుదీరిన మల్లన్న స్వామి ఆలయ వార్షికోత్సవాలు ముగింపులో భాగంగా బుధవారం స్వామివారి నాగెల్లి ఆలయం వద్ద అగ్నిగుండం ప్రదర్శన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవ సంఘాల సభ్యులు అగ్ని గుండంలో నుంచి నడిచే కార్యక్రమాన్ని చేపట్టారు. అంతకు ముందు అగ్నిగుండం ప్రదక్షణలో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించి చల్లగా చూడాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ యాదవ సంఘ అధ్య క్షుడు గణేష్, కార్యదర్శి దేవన్న ముకేష్, భైకాని మహేష్, చిన్నయ్య, నడ్పన్న, రామకృష్ణ, ఆశన్న, భూమన్న, రాజు, అబ్బాస్, సాగర్, సుమన్, దీక్షాస్వాములు, సంఘ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

తైక్వాండో క్రీడాకారిణికి ఆర్థిక సహాయం



తైక్వాండో క్రీడకారిణికి ఆర్థిక సహాయం అందజేస్తున్న ఉమ్మాజి నరేష్

సిరికొండ డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) తైక్వాండో క్రీడలో పాల్గొనడానికి వెళ్తున్న దాస్యం పూజితకు యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు న్యావనంది గ్రామానికి చెందిన ఉమ్మాజి నరేష్ బుధవారం పదివేల ఆర్థిక సహాయం అందజేశారు. జాతీయ తైక్వాండో క్రీడల్లో పాల్గొనడానికి ఎంపికైన శ్రీరాగ పూజిత ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉండడం వల్ల నరేష్ క్రీడల్ని ప్రోత్సహించాలనే లక్ష్యంతో పూజితకు ఆర్థిక సహాయం అందజేశారు. తైక్వాండో జాతీయ క్రీడల పోటీలు మధ్యప్రదేశ్‌లో జరుగుతున్నాయని నరేష్ తెలిపారు.

సీఎం కప్ బాస్కెట్‌బాల్ పోటీలకు కాకతీయ విద్యార్థులు



రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులతో ప్రిన్సిపాల్

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):నగరంలోని కాకతీయ ఒలంపియాడ్ సుభాష్‌నగర్ పాఠశాల విద్యార్థులు ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి సీఎం కప్ బాస్కెట్ బాల్ టోర్నీలో ఉత్తమ ప్రతిభను కనబర్చగా వారు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ చంద్రశేఖర్ తెలిపారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న హస్నిని, సమీక్షలు జిల్లాస్థాయి పోటీలలో ఉత్తమ ప్రదర్శన ఇవ్వగా వారు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని ఆయన తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులను, కోచ్‌ను అభినందించారు.

● సీఎం కప్ బేస్‌బాల్ రాష్ట్ర స్థాయి..

డిచ్‌పల్లి: ఈ నెల 18 నుంచి 21 వరకు హైదరాబాద్‌లోని ఎల్బీస్టేడియంలో జరగనున్న సీనియర్ బేస్‌బాల్ పోటీలకు ఇందల్వాయికి చెందిన కోటల శ్రీకర్ ఎంపికైనట్లు జిల్లాఅధ్యక్ష, కార్యదర్శులు మధుసూదన్,వినోద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సాఫ్ట్‌బాల్ కార్యదర్శి గంగామోహన్, పీడీ, కోచ్‌పాల్గొన్నారు.

● రాష్ట్ర స్థాయి పోటీలకు సుద్దపల్లి గురుకుల విద్యార్థి ఎంపిక

ఈ నెల 15 నుంచి 21 వరకు హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో జరగనున్న రాష్ట్ర బేస్‌బాల్ సీఎం కప్ పోటీలకు జిల్లా జట్టు నుంచి సాంఘిక సంక్షేమ సుద్దపల్లి గురుకుల విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నళిని తెలిపారు. జిల్లా జట్టును ప్రథమ స్థానంలో నిలపాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా క్రీడాకారులను వైస్ ప్రిన్సిపాల్, పీఈటీ లలిత, అభినందించారు.

విద్యుత్ శాఖ రైతు పొలంబాట



రైతు పొలంబాటలో పాల్గొన్న విద్యుత్ అధికారులు

ఎడపల్లి,డిసెంబరు18(ఆంధ్రజ్యోతి):ఎడపల్లి మండల కేంద్రంలో బుధవారం విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో రైతుపొలంబాట కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డీఈ టెక్నికల్ రమేష్ పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు పొలంబాట కార్యక్రమం ద్వారా రైతుల పొలాలలో ఏమైనా విద్యుత్ సమస్యలు ఉంటే వాటిని వెంటనే పరిష్కరించడం జరుగుతుందని, బోరు మోటారు ఎక్కువ మోతాదులో ఆమ్స్ తీసుకుంటే వాటికి కెపాసిటర్‌ను ఏర్పాటు చేసి తగ్గంచడం జరుగుతందన్నారు.రైతుల పొలాలలో విద్యుత్ తీగల ద్వారా ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే పరిష్కరించడం జరుగుతందని తెలిపారు. ఈకార్యక్రమంలో ఏడీఈ ప్రభాకర్, ఏఈ కిషోర్‌రెడ్డి, సీనియర్ లైన్ ఇన్స్‌పెక్టర్ శంకర్ నాయక్, లైన్ ఇన్స్‌పెక్టర్లు సత్యనారాయణ, పాషా, లైన్‌మెన్‌లు పవన్, సాయిబాబా, రైతులు ఉన్నారు.

టెలికాం రంగంలో భారత్ ప్రపంచంలో రెండో స్థానంలో ఉంది



కేజీబీవీలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రాయ్ అధికారి

సిరికొండ డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) టెలికాం రంగంలో ప్రపంచంలోనే భారత్ రెండో స్థానంలో ఉందని భారత టెలికాం ప్రాధికార సంస్థ ట్రాయ్ (కాగ్) సభ్యులు రావూరి ప్రభాకర్‌రావు అన్నారు. సిరికొండ మండలం అన్నపూర్ణేశ్వరి ఆలయం వల్ల గల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో టెలికాంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రావు మాట్లాడుతూ 1997లో టెలికాం వినియోగదారుల హక్కుల కోసం టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా యాక్ట్‌ను తీసుకొచ్చారని అన్నారు. వినియోగదారులకు ఏమైన సమస్యలు ఉత్పన్నమయినప్పుడు ఎవరికి ఫిర్యాదు చేయాలో, అనవసరమైన వ్యాపార ప్రకటనలకు సంబంధించిన కాల్స్‌గాని ఎస్ఎంఎస్‌లను నియంత్రించే అంశాలపై సదస్సులో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారి షేక్ పర్వీన్ బేగం, బీఎస్ఎన్ఎల్ డీఈ రమేష్,ఎస్డీఈ నవీన్‌గౌడ్,జేఈ , ఏఎస్సై బాల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

తప్పులు లేకుండా ఇందిరమ్మ ఇళ్ల సర్వే వివరాలు నమోదు చేయాలి



చిట్టాపూర్‌లో సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్

ముప్కాల్, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారుల వివరాల సర్వే తప్పులు లేకుండా ఆన్‌లైన్ యాప్ ద్వారా నమోదు చేయాలని అడిషనల్ కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. బుధవారం బాల్కొండ మండల కేంద్రంతో పాటు చిట్టాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న క్షేత్రస్థాయిలో సర్వే పనులను పరిశీలించారు. పంచాయతీ సెక్రెటరీలు ఇంటింటికి తిరుగుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలు సేకరిస్తూ వివరాలను అడిగి తప్పులు లేకుండా దరఖాస్తు వివరాలు మొబైల్ యాప్‌లో జాగ్రత్తగా నమోదు చేయాలని సూచించారు. నెలాఖరులోగా వంద శాతం పూర్తయ్యేలా చూడాలని అన్నారు.ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ దరఖాస్తు వివరాలు మొబైల్ యాప్‌లో నమోదు చేయాలని వారికి వివరించారు. శిథిలావస్థకు చేరిన పాతకాలపు ఇళ్లలో నివాసముంటున్న వారు వారిని కొత్త ఇళ్ల నిర్మించుకునే వారిని ముందుగా గుర్తించాలని, అలాంటి వివరాలు పూర్తి స్థాయిలో సేకరించి సర్వే యాప్‌లో పొందుపర్చాలన్నారు. అర్హత కలిగిన కుటుంబాలకు ప్రభుత్వం ప్రధాన్యత క్రమంలో నిరంతర ప్రక్రియగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్న దృష్ట్యా దరఖాస్తు వివరాలు నమోదు చేసి పొరపాట్లులేకుండా జాగ్రత్తగాజతపర్చాలని వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తు చేసుకున్న వారికి ఏమైన సందేహాలు ఉంటే గ్రామపంచాయతీలో కార్యదర్శిని సంప్రదించి సలహాలు తీసుకోవాలన్నారు.జేసీ వెంట ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీధర్,ఎంపీవో గంగామోహన్, పంచాయతీ కార్యదర్శి రజనీకాంత్,ఆర్ఐ, జూనియర్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

రెంజల్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ ఇళ్ల ఇంటింటి సర్వేను చేపట్టడంతో బుధవారం మండలంలోని తాడ్‌బిలోలి గ్రామంలో ఇళ్ల సర్వేను తహసీల్దార్ శ్రావణ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిమిత్తం లబ్ధిదారుల వివరాల నమోదును సక్రమంగా చేపట్టాలని, ఎటువంటి తప్పిదాలు లేకుండా లబ్ధిదారుల వివరాలను సేకరించాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర గౌడ్, కారోబార్ అనంత్ రావు ఉన్నారు.

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని 2,9,18, 24,26, 35వార్డులలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను మున్సిపల్ కమిషనర్ రాజు పరిశీలించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సర్వే చేయాలని లబ్ధిదారుల నుంచి సరైన సమాచారం సేకరించాలని సర్వే అధికారులకు సూచించారు.ఈకార్యక్రమంలో కౌన్సిలర్ ఖాందేశ్ సంగీత, సూపర్‌వైజర్లు గజానంద్, ఉదయ్‌శ్రీ, తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి: ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పకడ్బందీగా చేపట్టాలని బోధన్ డీఎల్‌పీఓ మధుకర్ అన్నారు. బుధవారం ఎడపల్లి మండల కేంద్రంలో చేపడుతున్న ఇందిరమ్మ ఇంటి సర్వేను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లకోసం దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఇంటికి వెళ్లి సర్వే చేసి పకడ్బందీగా నమోదు చేయాలని, ఈ నెలాఖరు లోగా సర్వే పూర్తి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో మన్‌మోహన్ శాస్త్రి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు గౌడ్, పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఆక్రమించుకున్న భూమి అటవీ అధికారుల స్వాధీనం



అటవీ వేసిన మేకల పాకను తొలగిస్తున్న అటవీ శాఖ అధికారులు

సిరికొండ డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) సిరికొండ గ్రామ పంచాయతీ పరిధిలోని మహిపాల్‌కు తండాకు చెందిన కొందరు గిరిజనులు అటవీ భూమిని ఆక్రమించు కున్నారని తెలిసిన వెంటనే బుధవారం డిప్యూటీ రేంజ్ అధికారి గంగారాం ఆధ్వర్యంలో వెళ్లి స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌చార్జి రేంజ్ అధికారి రవీందర్ తెలిపారు. హుస్సేన్‌నగర్ బీట్‌లో గల కంపార్టుమెంట్ నెంబర్ 408లో సిరికొండ మహిపాల్ తండాకు చెందిన వారు ఆక్రమించుకున్నారు. దానిని స్వాధీనం చేసుకుని కంటూర్ కందకాలు తవ్వినట్లు రేంజ్ అధికారి తెలిపారు. అటవీ భూమిలో వేసిన మేకల పాకను సైతం జేసీబీతో తొలగించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి గంగారాం, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆమరణ నిరాహార దీక్ష

సుభాష్‌నగర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న ఆమరణ నిరాహార దీక్ష బుధవారం మూడో రోజుకు చేరుకుంది. ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం ఏంటని డీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సుమన్ మహారాజ్ ప్రశ్నించారు. పేద ప్రజలకు వైద్య, విద్య, ఉపాధి, భూమి, ఇళ్లు సాధించేంతవరకు తమ పోరాటం ఆగదని అన్నారు. తమ దీక్షకు అన్ని వర్గాల ప్రజల నుంచి మద్దతు లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మహిపాల్, నాయకులు ప్రశాంత్, మురళి, శ్రీకాంత్, మహిపాల్, నిశాంత్, మహేష్ పాల్గొన్నారు.



దీక్ష చేస్తున్న దృశ్యం

సినిమా అనేది సమాజానికి ఉపయోగపడేలా ఉండాలి

● లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాశ్ నారాయణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

నిజామాబాద్ కల్చరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):సినిమా అనేది సమాజానికి ఉపయోగపడేలా ఉండాలని లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాశ్ నారాయణ అన్నారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన కళాశ్రీనివాస్ దర్శకత్వంలో నిర్మిస్తున్న దక్కన్ సర్కార్ చిత్రం పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ని కోట్లు పెట్టి తీసామనేది ముఖ్యం కాదని సమాజానికి ఏమేరకు ఉపయోగపడింది అనేదే ముఖ్యమని ఆయన అన్నారు. హీరోలు ఉంటేనే సినిమా కాదని సామాజిక కోణం ప్రజలకు ఉపయోగకరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సంగీత దర్శకుడు మల్లిక్ ఎంవికె, హీరో చాణక్య, సామాజిక వేత్త రంగనాయకుల సంతోష్‌బాబు పాల్గొన్నారు.

ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం



జితేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఈగ సంజీవ్‌రెడ్డి

సుభాష్‌నగర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఒలంపిక్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితుడైన జితేందర్‌రెడ్డికి జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు ఈగ సంజీవ్‌రెడ్డి సన్మానించారు. బుధవారం హైదరాబాద్‌లోని ఒలంపిక్ అసోసియేషన్ భవన్‌లో ఈగసంజీవ్‌రెడ్డి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులను మర్యాదపూర్వకంగా కలిశారు. క్రీడల అభివృద్ధికి కృషి చేయాలని, అన్ని జిల్లాల్లో సౌకర్యవంతమైన స్టేడియాలను నిర్మించాలని ఒలంపిక్ సంఘం అధ్యక్షుడిని కోరడం జరిగిందన్నారు. జిల్లాలో కూడా అంతర్జాతీయ క్రీడాకారులు ఉన్నారని వారికి సరైన ప్రోత్సాహలు ఇస్తే దేశానికి పేరు తెస్తారని వారికి సహాయ సహకారాలు ఇవ్వాలని ఆయన కోరారు.

నగరంలో దొంగల బీభత్సం

ఖిల్లా,డిసెంబరు18(ఆంధ్రజ్యోతి):నగరంలోని పలు ప్రాంతాల్లో దొంగలు బీభత్సం సృష్టించారు. మంగళవారం నగరంలోని ఒకటో టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో పలు దుకాణాల సముదాయాల్లో దొంగలు చొరబడి నగదును అపహరించారు. నగరంలోని ఖలీల్‌వాడిలో గల ఓ ల్యాబ్‌లో గుర్తుతెలియని దుండగులు షెటర్‌ను ధ్వంసం చేసి లోపల చొరబడి అందులోని రూ.10వేల నగదును ఎత్తుకెళ్లారు. అదే విధంగా ఆజాంరోడ్డు సమీపంలోని మెడికల్ షాపులో దుండగులు చొరబడి దొంగతనానికి పాల్పడ్డారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

● ఆటోనగర్‌లో తాళం వేసిన ఇంట్లో చోరీ

నగరంలోని ఆరోటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఆటోనగర్‌లో మంగవారం రాత్రి తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చొరబడి ఇంట్లో గల బీరువా నుంచి సుమారు 8తులాల బంగారు ఆభరణాలు అపహరించారు. ఇంటి యజమానురాలు శబానబేగం భర్త పని నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లగా ఒంటరిగా ఉండడంతో ఆమె ఇంటికి తాళం వేసి సమీపంలో నివాసం ఉండే తల్లిదండ్రుల ఇంటికి వెళ్లింది, బుధవారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా వేసిన తాళం ధ్వంసమై ఉండడాన్ని చూసి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఆరవ టౌన్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సౌత్‌రూరల్ ఇన్స్‌పెక్టర్ సురేష్‌కుమార్ తెలిపారు.

● అభంగపట్నంలో బైక్ చోరీ

నవీపేట: మండలంలోని అభంగపట్నం శివారులో బుధవారం సాయంత్రం బైక్ చోరీకి గురైందని స్థానికులు తెలిపారు. గ్రామానికి చెందిన దర్శనం సాయిలు అనే రైతు తన హీరో హెచ్ఎఫ్ డీలక్స్ బైక్‌ను ప్రధాన రహదారి పక్కన నిలిపిఉంచి పొలంకు వెళ్లాడని తిరిగి వచ్చేసరికి బైక్ కనిపించలేదని వారు పేర్కొన్నారు. బైక్ చోరీ విషయంపై పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేయనున్నట్లు స్థానికులు తెలిపారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

● ప్రమాదంలో రూ.4.40 లక్షల ఆస్తి నష్టం



తాటిపల్లిలో దగ్ధమైన ఇల్లు

సిరికొండ డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదం వల్ల మాలవత్ సుగుణ అనే మహిళ ఇళ్లు దగ్ధమయ్యింది. గ్రామస్థుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.బుధవారం ఉదయం ఇంట్లో విద్యుత్ బోర్డులో ప్రమాదం సంభవించి ఇళ్లకు నిప్పంటుకుంది.ఇంట్లో నుంచి మంటలు,పొగలు రావడాన్ని గమనించిన చుట్టు ప్రక్కల వారు గమనించి మంటలు ఆర్పి వేయడానికి ప్రయత్నించారు. ఇటీవల ధాన్యం అమ్మగా వచ్చిన రూ.రెండు లక్షల నగదును సంచిలో పెట్టి ఇంట్లోని కర్రలపైపెట్టిన నగదుసైతం మంటలకు ఆహుతి అయ్యాయని సుగుణ చెప్పారు. ప్రమాదంలో టీ.వీ, ఫ్రిడ్జ్, వంట సామగ్రి, బట్టలు, బియ్యం సైతం మంటలకు కాలి బూడిదయ్యాయని బాధితురాలు రోధిస్తూ చెప్పారు. తహసీల్దార్ రవీందర్ రావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గంగారాజం సంఘటన స్థలాన్ని పరిశీలించి జరిగిన నష్టాన్ని అంచన వేశారు. ఈ ప్రమాదంలో నాలుగు లక్షలనలభై వేల ఆస్తి నష్టం సంభవించినట్లు తహసీల్దార్ రవీందర్ రావు తెలిపారు.


గోల్డెన్ జూబ్లీ కళాశాలను తనిఖీ చేసిన డీఐఈవో

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):జిల్లా కేంద్రంలోని ఖిల్లా రోడ్‌లోగల గోల్డెన్ జూబ్లీ ప్రైవేటు జూనియర్ కళాశాలను బుధవారం డిఐఈవో రవికుమార్ తనిఖీ చేశారు. కళాశాలలోని తరగతి గదులను, పరిసరాలను పరిశీలించారు. తరగతి గదులను శుభ్రంగా ఉంచాలని, కళాశాల ఆవరణలో చెత్తాచెదారం లేకుండా చూడాలన్నారు. ఇంటర్ బోర్డు నియమనిబంధనల మేరకు కార్యాలయ ఫైళ్లు, రిజిస్టర్లు పూర్తి చేయాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా చూడాలన్నారు.

పీజీ ఇంటిగ్రేటెడ్ పరీక్షల తేదీల విడుదల

డిచ్‌పల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని పీజీ 1,3వ సెమిస్టర్ రెగ్యులర్, థియరీ ప్రాక్టికల్ పరీక్షలు ఎంఏ, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంకాం, ఎంబీఏ, ఎంసీఏ 5ఏళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సు ఏపీఈ, పీసీహెచ్, ఐఎంబీఏ, 1వ సెమిస్టర్ ఎల్ఎల్‌బీ, 5ఏళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సు ఐఎంబీఏ, 7,9వ సెమిస్టర్ పరీక్షల తేదీలను బుధవారం సీవోఈ అరుణ ప్రకటించారు. పీజీ 1వ సెమిస్టర్, ఎంఏ, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంకాం, ఎంఎస్సీ, 5ఏళ్ల ఇంటిగ్రేటెడ్ ఏపీఈ, అన్ని సబ్జెక్టులు కలిపి పరీక్ష ఫీజు రూ.500,ప్రాసెసింగ్ 200రూ. చెల్లించాలని ఎల్ఎల్‌బీ, 5ఏళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సు పీసీహెచ్, అన్ని సబ్జెక్టులకు 600రూ. ప్రాసెసింగ్ ఫీజు 200రూ. ఐఎంబీఏ, ఎంబీఏ, ఎంసీఏ, అన్ని సబ్జెక్టులకు రూ.800, పీజీ 3వ, ఐఎంబీఏ 7,9వ ఎంఏ, ఎంఎస్‌బ్ల్యూ, ఎంకాం, 5ఏళ్ల ఇంటిగ్రె టెడ్ కోర్సు అన్ని సబ్జెక్టులకు రూ.500 ఐఎంబీఏకు రూ.800 ఈ పరీక్షల ఫీజు అపరాధ రుసుము లేకుండా డిసెంబరు 30 వరకు చెల్లించువచ్చునని రూ.100 అపరాధ రుసుముతో జనవరి 6 2025 వరకు చెల్లించుకోవచ్చునని సీవోఈ అరుణ తెలిపారు. పూర్తి వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్ సంప్రదించాలని తెలిపారు.

విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను పోటీ పరీక్షలు వెలికి తీస్తాయి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో అశోక్

నిజామాబాద్‌అర్బన్,డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి):విద్యార్థుల్లో ఉన్న ప్రతిభ ను వెలికితీయ డానికి పోటీ పరీక్షలు ఎంతగానో ఉపయోగపడుతాయని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ అన్నారు.బుధవారంనగరంలోని రాధాకృష్ణ పాఠశాలలో జిల్లాస్థాయి జీవశాస్త్ర ప్రతిభ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భం గా వివిధ మండలాల నుంచి వచ్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఈసందర్భంగా డీఈవో మాట్లాడుతూ జిల్లాస్థాయిలో విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి పరీక్షలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో జీవ శాస్త్ర ఫోరం అధ్యక్షుడు శేఖర్, ప్రధాన కార్యదర్శి గోవర్ధన్, చారి, సాయి బాబా, గంగా కిషన్, ప్రశాంత్, పాల్గొన్నారు.

అర్ధరాత్రి అరెస్టులు తగదు

డిచ్‌పల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జేఏసీ తలపెట్టిన చలో హైదరాబాద్ ను పోలీసులు అడ్డుకొని అరెస్టులు చేయడం తగదని డిమాండ్ చేస్తు ఎంపీడీవో కార్యాలయం ఎదుట కార్మికులు ఆందోళన చే శారు. ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు గంగాధర్, టీయూసీఐ జిల్లా నాయకులు మురళిలు మాట్లాడుతూ.. అర్ధరాత్రి నాయకులను, పంచాయతీ కార్మికుల అరెస్టులను ఖండిస్తున్న మన్నారు. అనంతరం వినతి పత్రం ఎంపీ డీవో శ్రీనివాస్ గౌడ్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ నాయకులు రవి, పోశెట్టి, సంజీవ్, సాయిలు, కృష్ణ, గౌడ్ పాల్గొన్నారు.

ఫోక్ సింగర్ ఆత్మహత్య

● 21 రోజుల క్రితం ప్రేమ వివాహం ● ఇన్‌స్టాలో పరిచయంతో పెళ్లి ● హత్య చేశారంటున్న బంధువులు



శృతి మృతదేహం

జగదేవ్‌పూర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం కాస్త ప్రేమగా మారి 21 రోజుల క్రితం పెళ్లి చేసుకుంది. ఏం జరిగిందో ఏమో కానీ, బుధవారం ఆమె ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం పీర్లపల్లిలో బుదవారం వెలుగు చూసిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఎర్ర బిక్షపతి సత్తమ్మ దంపతుల కుమారుడు దయాకర్ హైదరాబాద్‌లో కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఫోక్ సింగర్ శృతి(26) జనపద పాటలు పాడి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసేది. ఈ క్రమంలో ఇన్‌స్టాగ్రామ్‌లో దయాకర్‌తో పరిచయం ఏర్పడింది. వీరి పరిచయం ప్రేమగా మారి 21 రోజుల క్రితం పీర్లపల్లి గ్రామంలో దయాకర్ కుటుంబ పెద్దల సమక్షంలో పెళ్లి చేసుకున్నారు. వారి ప్రేమ వివాహానికి శృతి తరఫున బంధువులు ఎవరూ రాలేదు. అయితే, బుధవారం గ్రామంలోనే దయాకర్ బంధువుల దశదిన కర్మ ఉండటంతో కుటుంబ సభ్యులంతా వెళ్లారు. శృతి ఒక్కరే ఇంట్లో ఉన్నారు. దశ దిన కర్మ కార్యక్రమానికి శృతిని తీసుకెళ్లేందుకు భర్త దయాకర్ రాగా, అప్పటికే ఇంట్లో ఉరి వేసుకుని కనిపించింది. కిందికి దించి చూడగా, అప్పటికే చనిపోయి ఉంది. దీంతో శృతి తల్లిదండ్రులకు సమాచారం అందించగా, వారు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ కుమార్తెను హత్య చేసి, ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని ఆమె బంధువులు ఆరోపిస్తున్నారు.

టీయూలో ఏబీవీపీ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

డిచ్‌పల్లి,డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): తెలంగాణ వర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎదుట ఏబీ వీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు శివా ఆర్వర్యంలో పోస్టర్లు ఆవిష్క రించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిసెంబరు 23, 24,25 తేదిల్లో సిద్దిపేట లో జరగనున్న రాష్ట్రమహాసభల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరుకావలన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ప్రతినిధులు నవీన్, సమీర్,సాయికుమార్,అక్షయ్,మోహన్, లెనిన్,సునీల్, నాయకులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.180	రూ.265	రూ. 285
వెన్‌కాబ్(కిలో)	: రూ.185	రూ.270	రూ. 290

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.79200	రూ.73000	రూ.945

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : పుష్ప-2 (10.00, 2.05, 6.10, 10.15)
స్క్రీన్-2 : ఫియర్ (11.15)
: మిస్ యూ (2.20)
: పుష్ప-2 (5.10, 9.15)
స్క్రీన్-3 : ప్రణయ గోదావరి (11.10)
: పుష్ప-2 (2.20, 6.25, 10.30)
స్క్రీన్-4 : పుష్ప-2 (10.00)
: పని (2.05)
: మిస్ యూ (5.10, 10.35)
: ఫియర్ (8.00)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : పుష్ప-2 (1.30, 7.00)
స్క్రీన్-2 : పుష్ప-2 (11.00, 4.30, 9.30)
స్క్రీన్-3 : మిస్ యూ (10.40, 1.20, 7.30, 10.15)



దేవి : పని (11.00, 2.00, 6.00, 9.00)
నటరాజ్ : పుష్ప-2 (హిందీ) (10.00, 2.00, 6.00, 10.00)
విజయ్ : పుష్ప-2 (10.00, 2.00, 6.00, 10.00)
లలితామహల్ : మిస్ యూ (11.00, 2.00, 6.00, 9.00)

- నిజామాబాద్ అర్బన్